క్లుప్తంగా

స్వామివారి సేవలో ఎమ్మెల్యే సింహాద్రి



మోపిదేవి: స్థానిక వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారిని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు, వైఎస్సార్ సీపీ రైతు విభాగం జోనల్ ఇన్‌చార్జి కడవకొల్లు నరసింహారావు మంగళవారం దర్శించుకున్నారు. ఆలయ ప్రదక్షిణ చేసిన వారు నాగపుట్టలో పాలుపోసి మొక్కుబడి చెల్లించుకున్నారు. ఆలయ ఏసీ ఎన్ఎస్ చక్రధరరావు స్వామివారి చిత్రపటం, లడ్డూ ప్రసాదాలు అందించారు. స్థానిక నాయకులు కామిశెట్టి వెంకట సురేష్‌బాబు, కోసూరు శివనాగమల్లేశ్వరరావు, పడమట వెంకటేశ్వరరావు, పోతరాజు శ్రీనివాసరావు, ఆలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సబ్సిడీపై మిశ్రమ దాణా సరఫరా

పెడన: పెడన, గూడూరు మండలాల్లోని పాడి రైతులకు సబ్సిడీపై మిశ్రమ దాణా (టీఎంఆర్)ను సరఫరా చేయనున్నామని పెడన పశు సంవర్ధక శాఖ ఏడీ కొనకళ్ల బాబూరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాడి రైతులు ఆధార్‌కార్డు, ఫోన్ నెంబర్‌తో సంబంధిత రైతు భరోసా కేంద్రాలు, పశు వైద్యశాలల్లో సంప్రదించాల్సి ఉంటుందన్నారు.
60 శాతం సబ్సిడీపై మిశ్రమ దాణా సరఫరా చేస్తామన్నారు. మిశ్రమ దాణా కిలో అసలు ధర రూ.16.50 ఉండగా 60 శాతం సబ్సిడీ పోను రైతుకు కిలో రూ.6.50లకు అందిస్తామని చెప్పారు. ఒక్కో రైతుకు ఒక యూనిట్ చొప్పున ఇస్తామన్నారు. ఒక యూనిట్‌లో 200 కిలోల బ్యాగ్ ఉంటుందని, రైతు రూ.1,300 చెల్లించి ముందుగా బుక్ చేసుకోవాల్సి ఉంటుందని వివరించారు.

రేపు మండల పరిషత్ సమావేశం

గూడూరు: గూడూరు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం గురువారం నిర్వహిస్తామని ఎంపీడీఓ డి.సుబ్బారావు తెలిపారు. ఎంపీపీ సంగా మధుసూదనరావు అధ్యక్షతన మధ్యాహ్నం రెండు గంటలకు జరిగే సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, పీఏసీఎస్ చైర్మన్లు, వివిధ శాఖల మండల స్థాయి అధికారులు విధిగా హాజరుకావాలని ఆయన కోరారు.

13, 14 తేదీల్లో విద్యార్థులకు పోటీలు

మచిలీపట్నం టౌన్: స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా సహాయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈనెల 13, 14 తేదీలలో విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్, వక్తృత్వ పోటీలు జరుగుతాయని ఫౌండేషన్ నిర్వాహకులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మచిలీపట్నంటౌన్, రూరల్‌కు చెందిన విద్యార్థులు పోటీల్లో పాల్గొనాలని వారు కోరారు. మరిన్ని వివరాలకు సెల్: 94400 34150, 92488 07494 నంబర్లను సంప్రదించాలని కోరారు.

చురుగ్గా పారిశుద్ధ్య పనులు

కోనేరుసెంటర్: ఎమ్మెల్యే పేర్ని వెంకటరామయ్య (నాని), ఆయన తనయుడు పేర్ని కిట్టు ఆదేశాల మేరకు మండలంలోని అన్ని గ్రామాల్లో పంచాయతీ సిబ్బంది పారిశుద్ధ్య పనులు చేపట్టారు. గ్రామాల్లో మురుగునీరు చేరిన ప్రాంతాలతో పాటు కచ్చా డ్రెయిన్లలో సున్నం, బ్లీచింగ్ చల్లించారు. గ్రామంలోని బావుల చుట్టూ సున్నం, బ్లీచింగ్ చల్లడంతో పాటు దోమల మందు పిచికారీ చేయించారు.

నిబంధనల మేరకు ఓటర్ల సర్వే

పెడన: పెడన నియోజకవర్గంలో సమగ్ర ఓటరు సర్వే రాష్ట్ర ఎన్నికల సంఘం నిబంధనల మేరకు జరుగుతోందనిపెడన నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి కె. రాజ్యలక్ష్మి అన్నారు. మంగళవారం ఆమె పెడన తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్, వివిధ రాజకీయ పార్టీ నాయకులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నాయకులు బండారు మల్లికార్జునరావు, సీపీఎం, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

చల్లపల్లిలో రమేష్ హాస్పిటల్స్ సేవలు

లబ్బీపేట(విజయవాడతూర్పు): దివిసీమ ప్రజలకు గుండె, మెదడు, నరాలకు సంబంధించి సూపర్ స్పెషాలిటీ సేవలను రమేష్ హాస్పిటల్స్ కృష్ణా జిల్లా చల్లపల్లిలో అందుబాటులోకి తీసుకు వచ్చింది. అక్కడి ఆర్యవైశ్య బజారులో ఏర్పాటు చేసిన సూపర్ స్పెషాలిటీ వైద్య విభాగాన్ని మంగళవారం డీఎంహెచ్ఓ డాక్టర్ గీతాబాయి, ప్రముఖ వైద్యులు డీఆర్‌కే ప్రసాద్ ప్రారంభించారు. రమేష్ హాస్పటల్స్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ పావులూరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

బీసీలను గుర్తించాలి

మోపిదేవి: అవనిగడ్డ నియోజకవర్గంలో మత్స్యకార ఓటింగ్ శాతం సుమారు 40 వేలు ఉందని, మిగతా బీసీలను కలుపుకుంటే 80 వేలకు పైగా ఓటింగ్ శాతం ఉన్న బీసీలకు రాజకీయ పార్టీలు తగిన ప్రాధాన్యత ఇవ్వాలని సర్పంచ్‌ల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చిలకలపూడి పాపారావు అన్నారు. మంగళవారం మోపిదేవి వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని దర్శించుకుని ఆయన మాట్లాడారు.

సరిలేరు మీకెవ్వరు



నా పేరు గుడిసె మహాలక్ష్మి. పెడన 19వ వార్డు దక్షిణ తెలుగుపాలెంలో నివాసం. నా భర్త రాముడు. ఆకుకూరలు ఇంటింటికి తిరుగుతూ విక్రయిస్తూ జీవనం సాగిస్తున్నాం. నాకు క్యాన్సర్ వ్యాధి సోకడంతో ఐదు నెలల కిందట గుంటూరులోని పెద్దాసుపత్రిలో చికిత్స తీసుకున్నా. శస్త్రచికిత్స చేశారు. డబ్బు అవసరమైంది. ఆ సమయంలో మా వలంటీరు రాజు (శిరివెళ్ల రాజేంద్రప్రసాద్) ఆస్పత్రికి వచ్చి పింఛను సొమ్ము అందజేశారు. ఇది మాకు ఎంతగానో ఉపయోగపడింది. మాబోటి వృద్ధులకు ఈ విధంగా పింఛను ఇంటివద్దకే తీసుకువచ్చి ఇస్తుండటం మాటల్లో చెప్పలేనిది. ఇంత గొప్ప వ్యవస్థను ప్రవేశపెట్టిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు. వలంటీర్ వ్యవస్థపై ప్రతిపక్షాల నాయకులు విమర్శలు చేయడం తగదు.



నాపేరు అక్కింశెట్టి ఆదిలక్ష్మి. నా భర్త నాగేశ్వరరావు. మేము నేత పని చేసుకుంటూ జీవనం సాగిస్తుంటాం. పెడన 20వ వార్డు రామలక్ష్మి వీవర్స్ కాలనీలో నివాసం. మా వారికి చేనేత కార్మికునిగా పింఛను వస్తుంది. నాకు నేతన్న నేస్తం, వైఎస్సార్ ఆసరా, చేయూత పథకాలు ఇచ్చారు. ఇవే కాకుండా మా అబ్బాయి రామలింగం. దివ్యాంగుని పింఛను పొందుతున్నాడు. వేకువ జామునే మా వలంటీరు సుధా (దాసరి సుధారాణి) ఇంటికి వచ్చి ఇస్తుండటం చాలా సంతోషంగా ఉంది. గతంలో ఇంటికి వచ్చి ఇచ్చే పరిస్థితి లేదు.

- విపత్తుల సమయంలోనూ అందుబాటులోనే..
- ప్రతి నెలా మొదటి తేదీనే పెన్షన్ల పంపిణీ
- వలంటీర్ల సేవలపై సర్వత్రా హర్షం



వేకువ జామునే పింఛన్ అందజేస్తున్న వలంటీర్ (ఫైల్)



గుంటూరు జీజీహెచ్‌కి వెళ్లి పింఛను అందజేస్తున్న వలంటీరు (ఫైల్)

వలంటీర్లకు వందనం

పెడన: ప్రభుత్వ పాలనను ప్రజలకు మరింత చేరువ చేయాలనే లక్ష్యంతో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వలంటీర్ వ్యవస్థ ప్రవేశపెట్టింది. పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల్లో వీరు అందిస్తున్న సేవలకు మంచి గుర్తింపు లభిస్తోంది. ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా ప్రజలకు, ప్రభుత్వానికి వారధులుగా వీరు అందిస్తున్న సేవలపై ప్రశంసల జల్లు కురిపిస్తున్నాయి. కరోనా వంటి విపత్కర సమయంలో సైతం ప్రాణాలను పణంగా పెట్టి బాధితులకు ఎనలేని సేవలు అందించి అందరి మన్ననలు పొందారు. మానవత్వంతో మేమున్నామంటూ బాధితులకు భరోసా కల్పించి అండగా నిలిచారు. ప్రభుత్వ పథకాల గురించి ప్రజలకు ఎప్పటికప్పుడు తెలియజేస్తూ అర్హులుంటే దరఖాస్తులు చేయిస్తూ వారికి ఆయా ఫలాలను అందించేలా అడుగులు ముందుకు వేస్తున్నారు. ప్రతి నెలా ఒకటో తేదీన వేకువ జామునే ఇంటి తలుపు తట్టి నేతన్నలకు, అవ్వాతాతలకు, దివ్యాంగులకు, వితంతు మహిళలకు సామాజిక పెన్షన్లు అందిస్తూ తమకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుని కుటుంబ సభ్యుల్లో ఒకరిగా మన్ననలు పొందుతున్నారు. ఇలాంటి వలంటీర్లపై ప్రతిపక్షాలు విమర్శలు చేయడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. నిస్వార్థంగా సేవలు అందించే వీరిపై విమర్శలు చేయడం తగదని పలువురు పేర్కొంటున్నారు.

కన్నబిడ్డల్లా అండగా నిలుస్తున్నారు



గతంలో వృద్ధాప్య పెన్షన్ తీసుకోవాలంటే మున్సిపల్ కార్యాలయానికి కాళ్లు ఈడ్చుకుంటూ వెళ్లి గంటల తరబడి పడిగాపులు కాయాల్సి వచ్చేది. నేను కూడా ఇలాగే ఇబ్బందులు పడాలా అని అనుకునే వాడిని. నేను పింఛను తీసుకునే సమయానికి వలంటీరు లత ఇంటికి తీసుకువచ్చి ఇస్తుండటంతో ఆనందంగా ఉంది. ఎక్కడికో వెళ్లి నిరీక్షించాల్సిన దుస్థితి లేదు. ప్రతి నెలా మొదటి రోజే సూర్యోదయం కాకమునుపే తలుపు తట్టి ఠంచనుగా పెన్షన్ ఇచ్చి వెళ్తోంది. పని ఉందంటే వారే చేసి పెడుతున్నారు. ఈ వయస్సులో మాకు వలంటీర్లు కన్నబిడ్డల్లా అండగా నిలుస్తున్నారు.

– కడియం ఏడుకొండలు, 15వ వార్డు, పెడన

ఆప్యాయంగా పలకరించి పింఛను ఇస్తున్నారు



మా వలంటీరు పండు (ముత్యాల నరసింహారావు). పింఛను తీసుకువచ్చి ఎలా ఉన్నారంటూ ఆప్యాయంగా పలుకరించి క్షేమ సమాచారం తెలుసుకుని పింఛను ఇస్తున్నారు. ఆ సమయంలో చెప్పలేని ఆనందం కలుగుతుంది. ప్రభుత్వ జీతమైనా ఆలస్యమవుతుందేమో కాని మా పింఛను మాత్రం జాప్యం కాదు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి పొందాలంటే ఎవరిని సంప్రదించాలో తెలిసేది కాదు. ఒక వేళ తెలిసినా దరఖాస్తు చేసుకోవడానికి కాళ్లరిగేలా కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేది. మా వలంటీరు ద్వారా ఈకేవైసీ చేయిస్తూ రైతు భరోసా పొందుతున్నాం. నిస్వార్థంగా సేవలు అందిస్తున్న వలంటీర్లను అభినందించాల్సిందే. వీరిపై విమర్శలు చేయడం దుర్మార్గం.

– షగీర్ అహ్మద్, బర్కతున్నీసా, 6వ వార్డు, పెడన

మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట

ఎమ్మెల్యే పేర్ని నాని



డ్రెయిన్ నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పేర్ని నాని

మచిలీపట్నం టౌన్: మచిలీపట్నంలోని పలు డివిజన్లలో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నామని ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని) అన్నారు. 39వ డివిజన్‌లో 15 ఆర్థిక సంఘం నిధులు రూ. 2.87 లక్షలతో నిర్మించనున్న డ్రెయిన్ పనులను ఆయన టెంకాయ కొట్టి ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్ద మనసుతో మచిలీపట్నం అభివృద్ధికి తోడ్పాటును అందిస్తున్నారన్నారు. మచిలీపట్నం అభివృద్ధికి బాటలు వేస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ మేయర్ మోకా వెంకటేశ్వరమ్మ, డెప్యూటీ మేయర్ శీలం భారతి, కార్పొరేటర్ గోపిశెట్టి సతీష్, కో–ఆప్షన్ సభ్యురాలు మట్ట తులసి, మాజీ కౌన్సిలర్ చిటికెన నాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు శ్రీకాకుళపు నరసింహగుప్తా, షేక్ మహమ్మద్ సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

పంజాలకు రూ. 5.30 లక్షల ఆర్థిక సాయం

మచిలీపట్నంటౌన్: మొహర్రం దుఃఖదినాల సందర్భంగా నగరంలోని పంజాలకు రంగులు వేసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ. 5.30 లక్షల ఆర్థిక సాయాన్ని అందించిందని వైఎస్సార్ సీపీ మైనార్టీ విభాగం జోనల్ ఇన్‌చార్జి షేక్ సలార్‌దాదా తెలిపారు. సలార్‌దాదా మాట్లాడుతూ మొహర్రం దుఃఖదినాలకు ముందే ప్రభుత్వం పంజాలకు ఆర్థిక సాయం అందించాల్సి ఉందని, అయితే రాష్ట్ర వక్ఫ్‌బోర్డు పాలకవర్గం రద్దయిన కారణంగా అధికారులు అందుబాటులో లేక ఆలస్యమైందన్నారు. నగరంలోని 106 పంజాల పెయింట్, మరమ్మతుల నిమిత్తం చెక్కులను మంగళవారం ఆయా పంజాల నిర్వాహకులకు ఇనుగుదురుపేటలోని సకీనా ఫంక్షన్‌హాల్‌లో అందజేశారు. కార్పొరేటర్ మీర్ అస్గర్‌అలీ, మాజీ కౌన్సిలర్లు చిటికిన నాగేశ్వరరావు, శీలం బాబ్జి, నాయకులు పాల్గొన్నారు.

రోడ్లపై పశువుల సంచారాన్ని నియంత్రించండి

కలెక్టర్ రాజాబాబు

చిలకలపూడి(మచిలీపట్నం): మచిలీపట్నం నగరంలో రోడ్లపై అడ్డుగా ఉంటూ ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్న పశువుల సంచారాన్ని నియంత్రించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పి. రాజాబాబు అన్నారు. మంగళవారం ఆయన టెలీ కాన్ఫరెన్స్‌లో అధికారులతో మాట్లాడారు. నగరంలోని రోడ్లపై పశువుల సంచారం అధికంగా ఉందని, వీటి ద్వారా ప్రమాదాలు జరిగి ప్రజలు ఇబ్బందులు పడే అవకాశం ఉన్నందున వీటి నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. తక్షణమే మునిసిపల్ కమిషనర్, ఆర్డీఓ, పోలీస్ శాఖాధికారుల సమన్వయంతో జాగ్రత్తలు చేపట్టాలన్నారు. జిల్లాలో ఎంత విస్తీర్ణంలో ఆక్వా జోన్, నాన్ ఆక్వా జోన్ ఉందో వివరాలు సేకరించాలని మత్స్య శాఖాధికారులకు సూచించారు. జోన్ల పరిధిలో ప్రైవేటు, ప్రభుత్వ స్థలాలు ఏ మేరకు ఉన్నాయో వాటి వివరాలతో కూడిన నివేదికను ఈ నెల 11వ తేదీలోగా అందించాలన్నారు. గ్రామాల్లో అందుబాటులో ఉన్న రికార్డులను పరిశీలించి రెవెన్యూ, సర్వే, వ్యవసాయాధికారుల సమన్వయంతో వివరాలు సేకరించాలన్నారు. ఇంటింటి ఓటర్ల జాబితా పరిశీలన కార్యక్రమంలో భారత ఎన్నికల సంఘం నిబంధనల మేరకు ఈ నెల 20వ తేదీలోగా ఈ ప్రక్రియను సజావుగా పూర్తి చేయాలని చెప్పారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమం ద్వారా వచ్చిన అర్జీలపై సరైన పరిష్కారం చూపాలన్నారు. టెలీ కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ అపరాజితసింగ్, డీఆర్వో వెంకటేశ్వర్లు, అధికారులు పాల్గొన్నారు.

27 మందికి కంటి ఆపరేషన్లు

బంటుమిల్లి: పెదతుమ్మిడి పీహెచ్‌సీ పరిధిలోని గ్రామాలకు చెందిన 27 మంది అవ్వ, తాతలను కంటి ఆపరేషన్ల నిమిత్తం మంగళవారం ఏలూరులోని శంకర్ కంటి ఆస్పత్రికి తరలించారు. వైఎస్సార్ కంటి వెలుగు పథకంలో భాగంగా కంటి వైద్యులు రమణ పీహెచ్‌సీ పరిధిలోని గ్రామాల్లో శిబిరాలు నిర్వహించి ఆపరేషన్లు అవసరమైన వారిని గుర్తించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బస్సును ఎంపీపీ వి. చినబాబు ప్రారంభించి మాట్లాడారు.

తల్లిపాలపై అవగాహన

బంటుమిల్లి: బంటుమిల్లి గ్రామ పరిధిలోని గర్భిణులు, బాలింతలకు తల్లిపాలపై అవగాహన కార్యక్రమం మంగళవారం స్థానిక కార్యాలయంలో నిర్వహించారు. ఐసీడీఎస్ బంటుమిల్లి ప్రాజెక్టు సీడీపీఓ ఎం. సముద్రవేణి మాట్లాడుతూ తల్లిపాల ప్రాధాన్యతను వివరించారు.

జయహో జగన్ రన్నింగ్ యాత్ర ప్రారంభం



రన్నింగ్ యాత్ర చేపట్టిన యువకుడు నాగేంద్రనాథ్

మోపిదేవిలంక(మోపిదేవి): మోపిదేవిలంక గ్రామం నుంచి స్థానిక దళిత యువకుడు కారుమూరి నాగేంద్రనాథ్ జయహో జగన్ నినాదంతో చేపట్టిన రన్నింగ్ యాత్రను అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు మంగళవారం ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ యాత్ర జయప్రదం కావాలని ఆకాంక్షించారు. యాత్ర మోపిదేవిలంక నుంచి లక్ష్మీపురం వరకు సాగుతుంది. కారుమూరి నాగేంద్రనాథ్ మాట్లాడుతూ దేశంలోనే ఎక్కడా లేనివిధంగా సీఎం జగనన్న ఎన్నో సంక్షేమ పథకాలతో ప్రజలను ఆదుకుంటున్నారని చెప్పారు. సంక్షేమం, అభివృద్ధి కొనసాగించేందుకు మరోసారి జగనన్నను ముఖ్యమంత్రిని చేయాలని కోరుతూ ఈ యాత్ర చేపట్టామని వివరించారు. తొలుత నాగాయితిప్ప గ్రామంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మోపిదేవిలంక, నాగాయితిప్ప సర్పంచ్‌లు మోర్ల జోత్స్న, గరికిపాటి వెంకటేశ్వరరావు, పీఏసీఎస్ చైర్‌పర్సన్లు గరికిపాటి గోవిందరాజులు, ఆది రాంబాబు, రెడ్రౌతు వెంకట రమణ, తుటారం కృష్ణ, కోసూరు కోటేశ్వరరావు, ఎంపీటీసీ సనకా వెంకట రాజేష్‌బాబు, నాయకులు పాల్గొన్నారు.

సత్యనారాయణకు సన్మానం

పెడన: గౌరవ డాక్టరేట్ అవార్డును అందుకున్న కొల్లూరి సత్యనారాయణ(చిన్నా)ను మంగళవారం పెడన పట్టణ హోల్‌సేల్ అండ్ రిటైల్ కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు ఘనంగా సన్మానించారు. సంఘ నాయకులు ఆత్మకూరి సురేష్‌కుమార్, కొల్లిపర పూర్ణప్రదీప్, బెజవాడ నాగరాజు, కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

'స్పందన' సమస్యల పరిష్కారం

పెడన: పట్టణంలోని 17వ వార్డుకు చెందిన అక్క, తమ్ముళ్ల ఆస్తి విషయంలో నెలకొన్న సమస్యలపై వచ్చిన స్పందన ఫిర్యాదును తహసీల్దార్ మధుసూదనరావు పరిష్కరించారు. ఇరువర్గాలతో మాట్లాడి అందరి ఆమోదంతో సమస్యను కొలిక్కి తీసుకువచ్చారు. అలాగే జిల్లా ఎస్పీ జాషువాకు అందిన స్పందన ఫిర్యాదుతో మండల పరిధిలోని చేవేంద్ర గ్రామానికి చెందిన కుటుంబ సభ్యులతో మాట్లాడి సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకున్నారు. డెప్యూటీ తహసీల్దార్ కాగిత పూర్ణచంద్రరావు, ఆర్ఐ ఎం. మణికంఠ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మచిలీపట్నంటౌన్: విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా పలు ప్రాంతాల్లో బుధవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ ఈఈ మన్నెం భాస్కరరావు ఒక ప్రకటనలో తెలిపారు. సర్కిల్‌పేట, జలాల్‌పేట, ఉల్లింగిపాలెం, ఓగిస్‌పేట ప్రాంతాల్లో ఉదయం 8.30 నుంచి 10.30 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామని చెప్పారు.

నేడు పల్లెపాలెంలో గడప గడపకు మన ప్రభుత్వం

కృత్తివెన్ను: మండల పరిధి పల్లెపాలెం గ్రామ పంచాయతీలో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరుగుతుందని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ వెంకట్రాజు తెలిపారు. మంత్రి జోగి రమేష్ పాల్గొని ప్రజల సమస్యలను తెలుసుకుంటారని చెప్పారు.

అన్నసమారాధన

పెడన: శ్రావణమాసం పౌర్ణమిని పురస్కరించుకుని మంగళవారం పట్టణంలోని ముత్యాలమ్మ ఘతం (చిన పైడమ్మ అమ్మవారి) ఆలయంలో భారీ అన్న సమారాధన నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ కటకం నాగకుమారి, వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ బండారు మల్లి అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం అన్నసమారాధనను మున్సిపల్ చైర్‌పర్సన్ ప్రారంభించగా భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆర్థిక చేయూత

కోడూరు: నరసింహపురానికి చెందిన రాజ్యలక్ష్మి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిరుపేద విద్యార్థులకు మంగళవారం ఆర్థిక సాయం అందజేశారు. స్థానిక గ్రంథాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో పది మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.5 వేల విలువల గల చెక్కులను ఎస్ఐ రాజేంద్రప్రసాద్ చేతుల మీదుగా అందించారు. గ్రంథాలయ అధికారి పుష్పలత విద్యార్థులకు పుస్తకాలను అందించారు.

పేదల సంక్షేమమే లక్ష్యం

గడప గడపకు మన ప్రభుత్వంలో మంత్రి జోగి రమేష్



పల్లెపాలెంలో వృద్ధురాలిని ఆప్యాయంగా పలుకరిస్తున్న మంత్రి జోగి రమేష్

కృత్తివెన్ను: పేదల సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన చేస్తున్నారని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖా మంత్రి జోగి రమేష్ అన్నారు. మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని కృత్తివెన్ను మండలం పల్లెపాలెం పంచాయతీలో నిర్వహించారు. స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మహిళలు తమకు ప్రభుత్వం నుండి లక్షలాది రూపాయలు సంక్షేమం రూపంలో అందాయని మంత్రికి సంతోషంగా వివరించారు.

తాగునీటి సమస్యను పరిష్కరిస్తా..

పల్లెపాలెంలో హైవే నిర్మాణ సమయంలో పైపులైన్లు పాడవడంతో తాగునీటి సమస్య నెలకొందని, వెంటనే పూర్తి స్థాయిలో మరమ్మతులు చేయించి తాగునీటి సమస్యను పరిష్కరిస్తామని మంత్రి తెలిపారు.

వేకువజామునే పింఛన్ల పంపిణీ..

తెల్లవారకముందే జగనన్న ప్రభుత్వంలో ఇంటికి వచ్చి వలంటీర్లు పింఛను అందజేస్తున్నారని పలువురు వృద్ధులు మంత్రికి వివరించారు. గతంలో పంచాయతీ కార్యాలయాల వద్ద గంటలు తరబడి వేచి చూసేవారమని, ఇప్పుడు ఆ బాధ తప్పిందన్నారు.

జగన్ మామయ్య మంచి చేస్తున్నారు..

పల్లెపాలెం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులతో మంత్రి జోగి రమేష్ మాట్లాడారు. మధ్యాహ్న భోజనం బాగుంటుందా అని ప్రశ్నించగా చాలా బాగుంటోందని, జగన్ మామయ్య ఇచ్చిన బ్యాగ్, పుస్తకాలు, షూస్, బెల్టు బాగున్నాయని సంతోషంగా చెప్పారు. ప్రతి ఇంటికి వెళ్లిన మంత్రికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ఎంపీపీ గరుడప్రసాద్, ఏఎంసీ చైర్మన్ గంగాధర్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ వెంకట్రాజు, కాపు, స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ల డైరెక్టర్లు పి. మహేష్, భూపతి రాజు, సర్పంచ్ కొల్లాటి రాజు, ఎంపీటీసీ కొల్లాటి కృష్ణ, జేసీఎస్ కన్వీనర్ బాపూజీ, ఎంపీడీఓ పిచ్చిబాబు, తహసీల్దార్ రామకోటేశ్వరరావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

గడప గడపకు సంక్షేమ లబ్ధి

ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు



సంక్షేమ లబ్ధి బ్రోచర్‌ను అందిస్తున్న ఎమ్మెల్యే రమేష్‌బాబు

కోడూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటి నుంచి సంక్షేమ ఫలాల రూపంలో ప్రతి గడపకు లబ్ధి చేకూర్చిందని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని మంగళవారం విశ్వనాథపల్లి సచివాలయం పరిధిలోని కుమ్మరిపాలెం గ్రామంలో నిర్వహించారు. గ్రామంలో 284 ఇళ్లకు వెళ్లి సంక్షేమ లబ్ధిని వివరించడంతో పాటు ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల సమయంలో ఇచ్చిన అన్ని హామీలను నెరవేర్చడంతో పాటు అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించారని చెప్పారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సచివాలయ, వలంటీర్ వ్యవస్థ ద్వారా కులమతాలు, పార్టీలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా పథకాలను ఇంటికే పంపిస్తున్నట్లు వివరించారు. గ్రామాల్లో రహదారులను అభివృద్ధి చేసేందుకు ప్రణాళిక రూపొందించామని చెప్పారు. దివి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొక్కిలిగడ్డ వీరవెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ యాదవరెడ్డి వెంకట సత్యనారాయణ, ఎంపీపీ కొండవీటి వెంకటకుమారి, మండల కన్వీనర్ పరిశె మాధవరావు, జిల్లా రైతు విభాగం కార్యదర్శి కొండవీటి వీరవెంకటనారాయణరావు, నాయకులు పాల్గొన్నారు.

సకాలంలో వైద్య సేవలు అందించాలి

డీఎంహెచ్ఓ గీతాబాయి

పురిటిగడ్డ(చల్లపల్లి): గ్రామాల్లో పాము కాటు కేసులు పెరిగిన నేపథ్యంలో సకాలంలో వైద్య సేవలు అందించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ జి.గీతాబాయి సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆమె సందర్శించారు. ఆశా డే సమీక్ష సమావేశంలో పాల్గొన్న డీఎంహెచ్ఓ సిబ్బందికి పలు సూచనలు చేశారు. మాతా శిశు సంరక్షణ, వ్యాక్సినేషన్ కార్యక్రమం అమలు, సీజనల్ వ్యాధుల నియంత్రణపై శ్రద్ధ వహించాలన్నారు. పాముకాటు ఇంజక్షన్లు తగిన స్థాయిలో నిల్వ చేసుకోవాలని సూచించారు.
కార్యక్రమంలో ఆర్‌బీఎస్‌కే జిల్లా నోడల్ అధికారి డాక్టర్ కుంభా రత్నగిరి, డిస్ట్రిక్ట్ ఆశా డీసీఎం తారక్, డిస్ట్రిక్ట్ హెల్త్ ఎడ్యుకేటర్ బి.రాజేంద్రప్రసాద్, వైద్యాధికారులు డాక్టర్ కేవీ పద్మావతి, డాక్టర్ కె.విజయరావు, హెల్త్ సూపర్‌వైజర్ తోట సుధాకరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీలో మచిలీపట్నానికి ద్వితీయ స్థానం



బందరులో చికిత్స పొందుతున్న బేతి రత్నబాయమ్మకు పెన్షన్ అందిస్తున్న వలంటీరు శోభన్

మచిలీపట్నంటౌన్: వైఎస్సార్ సామాజిక పింఛన్ల పంపిణీలో మచిలీపట్నం నగర పాలక సంస్థ ద్వితీయ స్థానంలో నిలిచింది. పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని వలంటీర్లు మంగళవారం తెల్లవారుజాము నుంచే ప్రారంభించారు. సాయంత్రానికి నగరంలో 82.27 శాతం పింఛన్లను పంపిణీ చేశారు. నగరంలో మొత్తం 18,360 పింఛన్లు ఉండగా 15,105 పింఛన్లను పంపిణీ చేశారు. ఇంకా 3,255 పింఛన్లను పంపిణీ చేయాల్సి ఉంది.

ప్రభుత్వాస్పత్రికి వెళ్లి పంపిణీ..

నగరంలోని 38వ డివిజన్‌కు చెందిన గూటాల ఆదినారాయణ కిడ్నీ, హృద్రోగ సంబంధిత వ్యాధులతో బాధపడుతూ సర్వజన ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. వలంటీర్ నేహ ఆస్పత్రికి వెళ్లి ఆదినారాయణకు పింఛను సొమ్ము అందజేసింది. అలాగే 36వ డివిజన్ డంపింగ్‌యార్డు ప్రాంతంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి సర్వజన ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న దివ్యాంగుడు షేక్ అల్లాభక్షుకు వలంటీర్ దమ్ము సత్యవతి ఆస్పత్రికి వెళ్లి పింఛన్ అందజేసింది.

తొలి రోజే 90 శాతం పంపిణీ

గూడూరు: సామాజిక పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని వలంటీర్లు ఉద్యమంలా చేపట్టారు. కోడి కూయకముందే లబ్ధిదారుల ఇంటికి వెళ్లి తలుపుతట్టి మరీ పెన్షన్ సొమ్ము అందజేశారు. సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులతో కలిసి వలంటీర్లు తమ గడపకే వచ్చి తెల్లవారుఝాము నుంచి పెన్షన్ల పంపిణీ చేయడంపై లబ్ధిదారులు ఆనందం వ్యక్తంచేస్తున్నారు. మండలంలో మొత్తం 8,139 పెన్షన్లు ఉండగా రూ.2,23,81,500 లబ్ధిదారులకు పంపిణీ చేయనున్నామని ఎంపీడీఓ డి.సుబ్బారావు తెలిపారు. మొదటి రోజు మంగళవారం 90శాతం పింఛన్లు పంపిణీ పూర్తి చేశామని ఆయన తెలిపారు.

పెడన: పట్టణంలో 4,461 మందికి గాను మొదటి రోజు 3,268 మందికి, మండలంలో 5,554 మందికి గాను 3,978 మందికి పింఛన్లు అందించారు. మండల పరిధిలోని జింజేరు గ్రామానికి చెందిన మొవ్వ పెద్దకృష్ణమూర్తి అనారోగ్యంతో విజయవాడలోని ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. మంగళవారం మధ్యాహ్నం జింజేరు గ్రామానికి చెందిన వలంటీరు శశికుమారి ఆస్పత్రికి వెళ్లి పింఛను అందజేసింది.

కరకట్ట ఆక్రమణదారులపై చర్యలు

ఉత్తరచిరువోలులంక (మోపిదేవి): పాత కృష్ణా కరకట్ట ఆక్రమణదారులపై చట్ట రీత్యా చర్యలు తీసుకుంటామని ఆర్‌సీ ఏఈ చిరంజీవులు తెలిపారు. ఉత్తర చిరువోలులంక నుంచి అయోధ్య వెళ్లే పాత కరకట్ట తవ్విన రెడ్రౌతు మాధవరావు కుమారుడు రాజేంద్రప్రసాద్‌పై మంగళవారం పోలీస్ స్టేషన్‌లో కేసు పెట్టామన్నారు. ఇటీవల గ్రామంలో నిర్వహించిన జగనన్న సురక్ష శిబిరంలో స్థానికులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎంపీడీఓ రామలింగేశ్వరరావు ఆర్‌సీ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. దీనిపై విచారణ చేసి తవ్విన కరకట్ట ప్రాంతాన్ని యథావిధిగా పూడ్చించాలని ఆ వ్యక్తికి నోటీసు ఇచ్చినట్లు చెప్పారు. అనంతరం కరకట్ట తవ్విన రాజేంద్రప్రసాద్‌పై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని వివరించారు.